క్లుప్తంగా

కొనసాగుతున్న నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న కార్మికులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని శాలీవాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్ కార్మికులు తమకు పవర్‌ప్లాంట్ యాజమాన్యం ఇవ్వాల్సిన వేతన బకాయిల కోసం 48రోజులుగా ప్లాంట్ గేటు ముందు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, ఉపాధ్యక్షుడు సగ్గుర్తి ఆనందరావు సోమవారం మాట్లాడారు. కార్మికులు ప్లాంట్ మూసివేసిన నాటి నుంచి ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక తీ వ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ప్లాంట్ మూసివేసి 16నెలలు గడిచినా యాజమాన్యం ఇప్పటికీ వేతనాలు, ఇతర బకాయిలు చె ల్లించడంలేదని ఆరోపించారు. యాజమాన్యం స్పందించి కార్మికులకు రావాల్సిన బకాయి సొమ్మును త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు వారసంత వేలం

తాండూర్: మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారసంత వేలంను మంగళవారం ఉదయం 11గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వారసంత కాల పరిమితి 2024–2025 సంవత్సరం మార్చి నెల వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 11గంటల లోపు దరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

నేడు తైబజార్ వేలం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో కూరగాయాల మార్కెట్, పశువుల సంత వేలాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు చెన్నూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 3గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. వేలంలో పాల్గొనే కాంట్రాక్టర్లు మున్సిపల్‌కు ఎలాంటి బకాయిలు లేమని ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. నింబధనలకు లోబడి వేలంలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన సొమ్ము వస్తే వేలం పూర్తి చేస్తామని కమిషనర్ తెలిపారు.

పరిమితికి మించి డబ్బులు తీసుకెళ్లొద్దు



తనిఖీ చేస్తున్న సీఐ కుమారస్వామి

తాండూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ.50వేలు పరిమితికి మించి డబ్బులు తీసుకెళ్లొద్దని తాండూర్ సీఐ కుమారస్వామి సూచించారు. మండలంలోని రేపల్లెవాడ గ్రామ శివారులో సోమవారం ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ విధించిన ఆంక్షలు తప్పనిసరిగా పాటించాలని, ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే 1950కు గాని, సి విజిల్ యాప్ ద్వారా గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ వెంట బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోచయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా క్వార్టర్‌ల కేటాయింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సోమవారం క్వార్టర్‌ల కేటాయింపుపై కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో 45క్వార్టర్‌లు కేటాయింపు కోసం ప్రకటించగా 45మంది దరకాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ప్రకారం పారదర్శకరంగా క్వార్టర్‌లు కేటాయించామని ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయబంధు ఉన్నారు.

కార్మికుడి మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న ఉద్యోగులు

మందమర్రిరూరల్: రెండు రోజుల క్రితం మందమర్రి ఏరియాలోని స్టోర్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన కర్రె రాజు ఆత్మకు శాంతి కలగాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్టోర్ ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ స్టోర్ ఫిట్ కార్యదర్శి కనకట్ల ఓదెలు, స్టోర్ ఎస్ఈ షైడీశ్వర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు ప్రశాంతం



దండేపల్లి: పరీక్ష కేంద్రం బయట సందడి



బెల్లంపల్లి: బజారు ఏరియా పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద గుమిగూడిన విద్యార్థులు



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటూ...



పద్దనపల్లి రాంపూర్ ఆవాస విద్యాలయంలో...

సాక్షి నెట్‌వర్క్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు తొలిరోజు తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి గుంపులుగా విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్ష కేంద్రం ప్రధాన ద్వారం వద్ద నోటీసు బోర్డు వద్ద విద్యార్థులు హాల్ టిక్కెట్ నంబర్లను సరిచూసుకోవడానికి పోటీ పడ్డారు. సరిగ్గా 8–30గంటల నుంచి ప్రధాన గేట్ వద్ద విద్యార్థులను పరీక్షించిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి పంపించారు. ఆ తర్వాత 9–30గంటలకు ప్రశ్నపత్రాన్ని అందజేయడంతో విద్యార్థులు పరీక్షకు ఉపక్రమించారు. మధ్యాహ్నం 12–30గంటలకు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాయడం పూర్తి చేసి విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చారు. పలు పరీక్ష కేంద్రాలను అధికారులు సందర్శించి పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు.



భీమారం: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



తాండూర్: తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయుడు



జన్నారం: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



చెన్నూర్: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



భీమారం: బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



నెన్నెల: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న సీఐ భన్సీలాల్

మంచిర్యాలక్రైం: ఎన్నికలు నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు.. జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను స్థానిక సీఐ భన్సీలాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలు ఎలా ఉన్నాయి. వాటి ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాలకు ఉపయోగకరంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పరిసర ప్రాంతాలపై కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మటన్ దుకాణాల్లో తనిఖీలు



పౌడర్ చల్లి పంచనామా చేస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మటన్ దుకాణాల్లో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాంసంపై పౌడర్ చల్లి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ధన్‌రాజ్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్న మేకలను కోసి ముందుగా, వైద్యాధికారితో స్టాంపింగ్ చేయించుకోవాలని, లేకపోతే కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అనంతరం దుకాణాలలో తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అజీం, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



భీమారం: మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ



బెల్లంపల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాదేవి



దండేపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

బెల్లంపల్లి: ఆరోగ్యంగా జీవించడాకి గర్భిణులు, తల్లులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ బెల్లంపల్లి సీడీపీవో ఎం.ఉమాదేవి సూచించారు. మున్సిపాలిటీ పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిరు ధాన్యాలలో పోషక విలువలు మెండుగా ఉంటాయన్నారు. ఆకుకూరలు, కూరగాయలను రోజువారీ ఆహారంలో తీసుకోవాలని, ప్రతీ రోజు ఉడక బెట్టిన కోడి గుడ్డును ఆహారంగా తీసుకోవడం వల్ల పోషకాలు పుష్కలంగా లభిస్తాయని పేర్కొన్నారు. చిన్నారులకు జంక్ ఫుడ్‌ను అలవాటు చేయొద్దన్నారు. గర్భిణులు, బాలింతలు తగినంత పోషకాహారం, విశ్రాంతిని తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఉమెన్ హబ్ సౌజన్య, జెండర్ సెన్సిడిజైర్ విజయ, పోషణాభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, రాజేశ్వరి, పద్మావతి, విజయలక్ష్మి, కనకతార, భారతి, ఆయాలు, తల్లులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని వందుర్‌గూడలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్షోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, విజయలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

భీమారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రాథోడ్ రాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన ఇంటింటా పోషణ అభియాన్ సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పిల్లలకు పోషకాహార లోపం అధికంగా ఉన్నవారిని గుర్తించి, పోషకాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజితతో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ

పాతమంచిర్యాల: పట్టణంలో ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ అధికారులు పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా, అంగన్‌వాడీ టీచర్ పద్మ, సహాయకురాలు లత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీదేవర బోనాలు

- మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవాలయంలో సోమవారం ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవర బోనాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఆలయ అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్‌రెడ్డి, నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మందమర్రిరూరల్: ఈ నెల 13న ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన మామిడిగట్టుకు చెందిన నాంపెల్లి సంగీత ఇంటికి సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వెళ్లి సంగీత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటానన్నారు. ఆయన వెంట చిర్రకుంట మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, మామిడిగట్టు మాజీ సర్పంచ్ సుంకరి నంబయ్య, కాంగ్రెస్ నాయకులు కుమార్, రాంచందర్, కమలామనోహర్‌రావు తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

బెల్లంపల్లిరూరల్: మందమర్రి ఏరియా స్టోర్స్‌లో శనివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడు కర్రె రాజు కుటుంబాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం సాయంత్రం పరామర్శించారు. మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలోని రాజు ఇంటికి వెళ్లి బాధిత కుటుంబానికి ఓదార్పునిచ్చారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ.. యువ కార్మికుడు రాజు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. కార్మికుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగరేణి సత్యనారాయణ, సీనియర్ నాయకులు మునిమంద రమేష్, మల్లేశ్, మొగిలి, రాజనర్సు తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాలకు ప్రైవేట్ వాహనాలే దిక్కు

నెన్నెల: మండలంలోని వివిధ గ్రామాల్లోని విద్యార్థులు పరీక్ష రాసేందుకు పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి కనీసం బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో ఆటోలు, టాటా ఏసీల్లో 25కిలోమీటర్ల దూరం నుంచి ప్రమాదకరంగా ప్రయాణిస్తూ పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల, గుండ్ల సోమారం, మైలారం, ఆవుడం, కుశ్నపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఆటోలలో ఒకరిపై ఒకరు కూర్చొని పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు పరీక్ష వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆటోలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

మోదీ సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



తరలివెళ్తున్న నాయకులు

దండేపల్లి: జగిత్యాలలో సోమవారం జరిగిన భారత ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు మంచిర్యాల జిల్లా నుంచి భారీగా జనం తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. దండేపల్లి మండలం గూడెం చెక్‌పోస్టు వద్ద కార్యకర్తలందరూ కలుసుకుని జగిత్యాలకు బయలుదేరి వెళ్లారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్‌జైన్, దండేపల్లి మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు గురువయ్య, మల్లేష్, అశోక్, రవీందర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చెన్నూర్: పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్లో రేకుర్తి కంటి ఆసుపత్రి, గర్లిల్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రెండో విడుత ఉచిత కంటి వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్, సామాజిక కార్యకర్త జాడి తిరుపతి తెలిపారు. 350మంది హాజరు కాగా 185మందికి కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు బాస్కర్‌రెడ్డి, అయ్యప్ప సేవా సమితి సభ్యులు రామయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ఎంపీవోపై దాడి హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న డీపీవో, అధికారులు



జైపూర్: నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు, సిబ్బంది

- నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన అధికారులు

జైపూర్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లిరూరల్/జన్నారం: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవోపై జరిగిన దాడికి నిరసనగా అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. దాడి చేయడం హేయమైన చర్య అని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వరరావు అన్నా రు. దాడికి నిరసనగా సోమవారం బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీ లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డీఎల్‌పీవో సప్తర్ అలీ, ఎంపీడీవో మహేందర్, మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాపురావు, బెల్లంపల్లి, నెన్నెల, తాండూర్, కాసిపేట మండలాల ఎంపీవోలు శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. జైపూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, జన్నారంలో మండల పంచాయతీ అధికారి రమేశ్, సిబ్బంది, చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, కోటపల్లి ఎంపీవో అక్తర్ మొయినోద్దీన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మధ్యాహ్న భోజన సమయంలో కార్యాలయాల ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

వరి పంట పరిశీలన

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని బావురావుపేట గ్రామంలోని వరిపంట పొలాలను సోమవారం ఏఈవో వనదేవి పరిశీలించారు. వరిలో అగ్గి తెగులు, ఉల్లికోడు ఉధృతి ఉందని నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. గట్ల వెంబడి కలుపు లేకుండా చూడాలన్నారు. తెగులు సోకిన పొలం నుంచి వేరొక పొలంలోకి నీరు వెళ్లకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు కెనరాబ్యాంకు లక్సెట్టిపేట బ్రాంచి ఆధ్వర్యంలో రూ.25వేల విలువ చేసే క్రీడా సామగ్రిని సోమవారం అందించారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ జోనల్ మేనేజర్ మాధవి, పాఠశాల హెచ్ఎం శంకర్‌గౌడ్, సీనియర్ మేనేజర్లు పెద్ది రాజ్‌కుమార్, వాసు, లక్సెట్టిపేట బ్రాంచ్ మేనేజర్ రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ టిక్కెట్ గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలి

చెన్నూర్: పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్ గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలని కాంగ్రెస్ యూత్ నాయకులు సహీమ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంశీకృష్ణకు ఎంపీ టిక్కెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో సైదుల రమేశ్, వెంగళ ఉదయ్, రాజశేఖర్, జన్నం శ్రీకాంత్‌చారి, షేక్ మోయిన్, ఎండీ ఇమాద్, కాటమరాయుడు, ఆతీఫ్, నరేశ్ పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం నాయకుల సంబురాలు

పాతమంచిర్యాల: తెలంగాణ ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రాష్ట్ర చైర్మన్‌గా మెట్టు సాయి నియామకంపై జిల్లాలోని గంగపుత్రులు, వాడ బలిజ సేవా సంఘం నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో స్వీట్లు పంపిణీ చేసుకుని సంబురాలు చేసుకున్నారు.

‘ఎమ్మెల్సీ కవితను విడుదల చేయాలి’

చెన్నూర్: ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కవితను భేషరతుగా విడుదల చేయకపోతే నిరసన కార్యక్రమాలను విస్తృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు శ్రావణ్, శ్రీధర్, ప్రశాంత్, పున్నం, రాజన్న, పోచన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

జైపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో వనజారెడ్డి హెచ్చరించారు.